క్లుప్తంగా

అందుబాటులో పోటీ పరీక్షల పుస్తకాలు

చెరుకుపల్లి: పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు అవసరమైన పుస్తకాలు చెరుకుపల్లి గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయని చెరుకుపల్లి గ్రంథపాలకురాలు కె.అరుణ శనివారం ఒక ప్రకటలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్ 1,2 ఉద్యోగాల భర్తీకి ప్రకటన వెలువరించిన నేపథ్యంలో గ్రంథాలయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చెరుకుపల్లి శాఖ గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉంచామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎస్టీయూ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



కర్లపాలెం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతం పెంచటంతో పాటు నాణ్యమైన విద్యనందించాలని ఎంఈఓ ఎస్.విజయశ్రీ తెలిపారు. మండల విద్యావనరుల కేంద్రం వద్ద శనివారం రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) నూతన క్యాలండర్, డైరీని ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఎస్టీయూ మండల కార్యదర్శి ఒ.శ్రీనివాసరావు, నాయకులు బి.సుబ్బారావు, బి.వెంకటేశ్వర్లు, బి.నాగరాజు, కె.బుజ్జిబాబు, ఆర్.అప్పారావు, బి.శ్రీనివాసరావు, ఎ.సంగీత బాబు, డి.ఆదినారాయణ, వి.శ్రీనివాసరావు, డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు అఖండ నాదోపాసన



తెనాలి: బ్రాహ్మణ పరిషత్, తెనాలి ఆధ్వర్యంలో ప్రముఖ సంగీత విద్వాంసుడు, 'కళైమామణి' బ్రహ్మశ్రీ తాడేపల్లి లోకనాథశర్మచే 12 గంటలపాటు అఖండ నాదోపాసన నిర్వహించనున్నారు. ప్రకృతివైపరీత్యాల నివారణ, విశ్వమానవ కల్యాణం, విశ్వశాంతి, కరోనా మహమ్మారి శాశ్వతంగా తొలగిపోవాలన్న ఆకాంక్షతో ఆదివారం సాయంత్రం ఆరు గంటల్నుంచి సోమవారం ఉదయం ఆరు గంటలవరకు నాదోపాసన ఉంటుందని తెలియజేశారు. కొత్తపేటలోని బ్రాహ్మణ పరిషత్ కార్యాలయంలో జరిగే నాదోపాసనలో సంగీత విద్వాంసులు, సంగీతాభిమానులు పాల్గొని జయ ప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు.

ఉత్తమ గవర్నర్‌గా 'గోనుగుంట్ల'




తెనాలిఅర్బన్: వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ సూపర్‌బెస్ట్ గవర్నర్‌గా తెనాలికి చెందిన గోనుగుంట్ల జయంత్ కుమార్‌ను శనివారం అవార్డు అందుకున్నారు. విజయవాడలోని ఓ ప్రైవేట్ హాల్‌లో శనివారం వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ అవార్డ్స్ ప్రోగ్రామ్‌ను నిర్వహించారు. అక్కడ జయంతి కుమార్‌ను సన్మానించి మెమొంటో అందజేసినట్లు సభ్యులు తెలిపారు. క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు పి.గాయత్రి, గోనుగుంట్ల సుజాత, ఎం.నాగభూషణం, ఎం.సత్య ప్రసాద్, కె.కళ్యాణి, తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

తెనాలిరూరల్: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కొలనుకొండ వంతెన వద్ద పట్టాల వెంబడి మృతదేహం ఉందన్న సమాచారంతో తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలాన్ని శనివారం పరిశీలించారు. సుమారు 35 నుంచి 40 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది పడి ఉన్నాడు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణను జయప్రదం చేయండి



తాడేపల్లిరూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ మహోత్సవానికి ప్రతి ఒక్కరూ తరలి రావాలని తాడేపల్లి పట్టణ వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ముదిగొండ ప్రకాష్, ఎస్సీ విభాగం కృష్ణా జిల్లా మాజీ అధ్యక్షుడు నలుకుర్తి రమేష్ కోరారు. శనివారం తాడేపల్లి ప్రెస్ క్లబ్‌లో ప్రకాష్ మాట్లాడుతూ విజయవాడలో ప్రభుత్వ నిధులతో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేశారని, ఈ విగ్రహాన్ని జనవరి 19న దళిత బాంధవుడు, పేదల పెన్నిధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో ప్రజలు హాజరు కావాలని కోరారు.

ఉత్సాహంగా క్రీడాపోటీలు

- కొనసాగిన ఆడుదాం ఆంధ్రా పోటీలు
- ఖోఖోలో ప్రతిభ చూపిన క్రీడాకారులు



వడ్డీవారిపాలెం సావిత్రి గణేష్ జడ్పీహైస్కూలులో ఖోఖో ఆడుతున్న గృహిణులు

రేపల్లె రూరల్: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా రేపల్లె పట్టణ, మండలంలోని సచివాలయాల పరిధిలో నిర్వహించిన ఆటల పోటీలలో భాగంగా శనివారం ఖోఖో పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో బాలికలు, గృహిణులు పాల్గొని సత్తా చాటారు. మండలంలోని వడ్డీవారిపాలెం సచివాలయం ఆధ్వర్యంలో శ్రీమతి సావిత్రి గణేష్ జడ్పీ హైస్కూలులో, చోడాయపాలెంలో సచివాలయ ఆవరణంలో, పేటేరులో మహాలక్ష్మి గుండెపాటమ్మ ఆలయ ఆవరణంలో ఆటల పోటీలు నిర్వహించారు. అదేవిధంగా మిగిలిన సచివాలయాల ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. పోటీలను సచివాలయాల వివిధ సెక్రటరీలు, సిబ్బంది, వలంటీర్లు పర్యవేక్షించారు.

ముగిసిన గ్రామస్థాయి పోటీలు ...

నగరం: గ్రామీణ ప్రాంతాలలోని క్రీడాకారుల ప్రతిభను గుర్తించేందుకు ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు దోహదపడతాయని ఎంపీడీఓ చక్రపాణి ప్రసాద్ చెప్పారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు గ్రామాలలో జరుగుతున్న క్రీడాపోటీలను ఎంపీడీఓ పర్యవేక్షించి మాట్లాడారు. గ్రామ స్థాయిలో క్రాడాకారులకు వాలీబాల్, బాల్‌బాడ్మింటన్, క్రికెట్, కబడ్డీ, ఖోఖో పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. 5 విభాగాలలో ప్రతి సచివాలయ పరిధిలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులతో జట్లను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. గ్రామస్థాయి ఆటలపోటీలు ముగిశాయన్నారు. ఈపోటీలలో ప్రతిభ కనబర్చిన జట్లు జనవరి 10 నుంచి జరిగే మండల స్థాయి ఆటలపోటీలలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చోడాయపాలెంలో ఖోఖో ఆడుతున్న బాలికలు

విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి: ఆర్డీఓ

కర్లపాలెం: విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆర్డీఓ జి.రవీందర్ తెలిపారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా చింతాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జరుగుతున్న క్రికెట్ పోటీలను బాపట్ల ఆర్డీఓ జి.రవీందర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలలో గ్రామీణ యువతను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమం ద్వారా ఆటల పోటలను నిర్వహిస్తుందని చెప్పారు. విజయవంతంగా ఆటల పోటీలు నిర్వహిస్తున్న అధికారులను, ఉపాధ్యాయులను ఆర్డీఓ అభినందించారు. తహసీల్దార్ కేశవ నారాయణరావు, కార్యదర్శులు కె.వీరాస్వామిరెడ్డి, వీఆర్ఓ సాంబయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు కోటేశ్వరమ్మ, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, క్రీడాకారులు తదితరులున్నారు.



నగరంలో జరిగిన ఆటల పోటీలలో పాల్గొన్న క్రీడాకారులు

జీవనోపాధి వృద్ధి పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ దీప సుమన్, ఎఫ్‌డీఓ సాయిసందీప్

నిజాంపట్నం: చేపల పెంపకానికి, మత్స్యకారుల జీవనోపాధి అభివృద్ధికి అందిస్తున్న పథకాలను సద్వినియోగ పరుచుకోవాలని జాతీయ మత్స్య అభివృద్ధి సంస్థ(ఎన్ఎఫ్‌డీబీ) ప్రతినిధి డాక్టర్ దీప సుమన్ తెలిపారు. శనివారం నిజాంపట్నం, కొత్తపాలెం గ్రామాల్లో మత్స్యశాఖ ఆధ్వర్యంలో ప్రీ-సాగర పరిక్రమ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ దీపసుమన్ మాట్లాడుతూ జనవరి 2వతేదీ నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్‌లో జరగనున్న బహిరంగ సభా కార్యక్రమానికి కేంద్ర మత్స్యశాఖ మంత్రి ముఖ్య అతిథులుగా పాల్గొననున్నట్లు తెలిపారు. అదేవిదంగా ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం, కిసాన్ క్రెడిట్ కార్డ్స్‌పై అవగాహన కల్పించారు. తీర ప్రాంత మత్స్యకారుల సంఘాలకు, నిరుద్యోగ యువతకు జీవనోపాధికి ఎన్ఎఫ్‌డీబీ, సీఐఎఫ్ఎంఈటీ సంస్థల ద్వారా ఎన్నో అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఇందులో భాగంగా మత్స్య సంబంధిత వ్యాపారాలు, వర్తకం, చేపలవేట చేసే మహిళలు, పురుషులకు కిసాన్ క్రెడిట్ కార్డుల అవశ్యకత వివరించారు. ఎఫ్‌డీఓ సాయి సందీప్, భాస్కర్, దీపక్, నిషాంత్, నిషిత్ తదితరులు పాల్గొన్నారు.

క్షణికావేశంతోనే అనర్థాలు



తెనాలిరూరల్: క్షణికావేశంతోనే అనర్థాలు చోటు చేసుకుంటున్నాయని, నేరాలకు పాల్పడి జీవితాలను అంధకారం చేసుకుంటున్నారని రెండో అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ జె.శ్రీసీత అన్నారు. తెనాలి సబ్ జైలును శనివారం ఆమె సందర్శించారు. ఖైదీలకు ఇస్తున్న ఆహారాన్ని, జైలు ఆవరణను పరిశీలించారు. అనంతరం ఖైదీలతో మాట్లాడారు. గతంలో చేసిన పొరబాట్లను ఇకపై చేయకుండా ఉండేలా జైలులోనే మంచి నడవడిక అలవర్చుకోవాలని సూచించారు. అవసరమైన వారికి మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ సలహా అందిస్తామని చెప్పారు. న్యాయమూర్తి వెంట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.వేణుగోపాలరావు, ప్యానల్ న్యాయవాది ఖాదర్ హుస్సేన్, పీఎల్‌వీ యర్రంశెట్టి అనిల్‌కుమార్, న్యాయశాఖ సిబ్బంది మహబూబ్ ఉన్నారు.

ప్రతిభావంతులైన చిన్నారులను ప్రోత్సహించాలి

తెనాలిటౌన్: గ్రామీణ ప్రాంతాల నుంచి వస్తున్న ప్రతిభావంతులైన చిన్నారులను ప్రోత్సహించాలని వల్లభాపురం గ్రామంలోని వినాయక స్వామి దేవాలయం వ్యవస్థాపక ధర్మకర్త అచ్యుత ఇందు శేఖర్ పేర్కొన్నారు. రూరల్ మండలం గుడివాడ గ్రామానికి చెందిన అత్యంత ప్రతిభావంతుడైన రెండేళ్ల చిన్నారి ప్రదీప్ నారాయణ్ కుటుంబానికి శనివారం ఆయన సందర్శించారు. చిన్నారిని, తల్లిదండ్రులను అభినందించారు. జిల్లా ప్రజా స్వామ్య హక్కు ల పరిరక్షణ ఐక్యవేదిక అధ్యక్షుడు ఆర్.శివకృష్ణ మా ట్లాడుతూ పిల్లల ప్రతిభను తల్లిదండ్రులు గుర్తించడం విశేషమన్నారు. చిన్నారుల ప్రతిభను మెరుగైన ప్రతిభగా మార్చేందుకు కుటుంబ పరిసరాల తో, మిత్రుల సహకారం ఉంటే భవిష్యత్తులో సమర్థులైన అధికారులుగా, పారిశ్రామికవేత్తలుగా ఎంతో మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించగలుగుతా రని విశ్రాంత సైనికోద్యోగి టి.శ్రీనివాసరావు మా ట్లాడుతూ మాణిక్యాలు మట్టిలో ఉన్నా మెరుస్తూనే ఉంటాయన్నారు. తెనాలి మండల స్వచ్ఛంద కార్యకర్త ప్రదీప్ మాట్లాడుతూ ప్రతిభావంతులైన చిన్నారులకు ప్రభుత్వం ప్రత్యేక సహకారం అందించాలన్నారు. ప్రకృతి జీవన విధానం ప్రచారకులు ఉల్లంటి శ్రీనివాస్ మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా అనేక మంది ప్రతిభావంతులైన చిన్నారులను గుర్తించి సమాజానికి పరిచయం చేశామన్నారు. వీరితో పాటు ఆలపాటి వెంకటేశ్వరరావు తదితరులు చిన్నారిని అభినందించారు.

క్రైమ్ కార్నర్

600 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



బెల్లం ఊట, నాటుసారా తయారీ సామగ్రిని ధ్వంసం చేస్తున్న దృశ్యం

నిజాంపట్నం: నాటుసారా తయారీ, విక్రయాలకు పాల్పడితే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని నగరం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ శ్రీనివాసరావు హెచ్చరించారు. మండలంలోని దిండి పంచాయతీ యేమినేనివారిపాలెం గ్రామ శివారులోని రొయ్యల ఫ్యాక్టరీ వెనుక నాటుసారా తయారీకి ఉపయోగిస్తున్న 600ల లీటర్ల బెల్లంఊటను గుర్తించి ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ నాటుసారా తయారీ, విక్రయాలు చట్టరీత్యా నేరమని తెలిపారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. యేమినేనివారిపాలెంలో నిర్వహించిన దాడుల్లో 600 లీటర్ల బెల్లంఊటను ధ్వంసం చేయడంతో పాటు నాటుసారా తయారీకి ఉపయోగించే పొయ్యి, సామాగ్రిని ధ్వంసం చేయడం జరిగిందన్నారు. అదేవిదంగా చెరుకుపల్లి మండలంలోని పొన్నపల్లి గ్రామంలో డి.దుర్గారావు నాటుసారా అమ్ముతుండటంతో అతన్ని అదుపులోనికి తీసుకుని నాటుసారాని స్వాధీన పరుచుకుని కేసునమోదు చేసినట్లు తెలిపారు.

నాటుసారా విక్రేత అరెస్ట్

చెరుకుపల్లి: అక్రమంగా నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నాటుసారా క్యానును స్వాధీనం చేసుకున్నట్లు నగరం సెబ్ సీఐ దేవర శ్రీనివాసరావు శనివారం తెలిపారు. మండల పరిధిలోని పొన్నపల్లి గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు అదేగ్రామానికి చెందిన డి.దుర్గారావు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని ఆయన వద్ద నుంచి 5 లీటర్లు నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. నిందితుడు దుర్గారావుపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచినట్లు తెలిపారు.

వ్యక్తి అరెస్ట్.. 20 మద్యం బాటిళ్లు సీజ్..

కర్లపాలెం: ప్రభుత్వ అనుమతులు లేకుండా మద్యం విక్రయించినా, బెల్టు షాపులు నడిపినా చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని సెబ్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. పేరలి గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు తమ సిబ్బందితో వెళ్లి సోదాలు నిర్వహించి కాటూరి సుబ్బారావు వద్ద 20 క్వార్టర్ మద్యం బాటిళ్లు గుర్తించి సీజ్ చేసి ఆయనను అరెస్ట్ చేసినట్లు శ్రీనివాసులు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన చెప్పారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



దీవి మోహనకృష్ణ (ఫైల్)

భట్టిప్రోలు: ఎదురెదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఓ వ్యక్తి తలకు తీవ్ర గాయాలపాలై ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే మండలంలోని దీవి మోహనకృష్ణ (32)మంగళగిరిలో బంగారపు పని చేస్తుంటాడు. అక్కడ నుంచి తన స్వగ్రామమైన ఐలవరంకు వచ్చి కుటుంబ సమేతంగా ఉంటూ కరెంటు పని చేసుకుంటున్నాడు. మళ్లీ తెనాలిలో బంగారపు పని దొరకడంతో ఈ నెల 26వ తేదీన ద్విచక్ర వాహనంపై తెనాలి వెళుతుండగా ఐలవరం-భట్టిప్రోలు మధ్య మార్గంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని ఢీకొనడంతో తలకు తీవ్ర గాయమైంది. వెంటనే బాధితుడ్ని స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో 108లో తెనాలి ప్రైవేట్ హాస్పటల్‌కు తరలించారు. అక్కడ నుంచి గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి తండ్రి చంద్రశేఖరరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బాధిత కుటుంబానికి అందజేశారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

జూదరులు అరెస్ట్

రేపల్లె రూరల్: కోడిపందేలు, పేకాట శిబిరాలపై దాడులు నిర్వహించి జూదరులను అదుపులోకి తీసుకున్న సంఘటన మండలంలోని రాజుకాలువ, మృత్యుంజయపాలెం గ్రామాలలో శనివారం చోటు చేసుకున్నాయి. చోడాయపాలెం ఎస్ఐ అబ్దుల్ రజాక్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజుకాలువ గ్రామంలో తమ సిబ్బందితో దాడులు నిర్వహించామన్నారు. దాడుల్లో కోడిపందేలు నిర్వహిస్తున్న ముగ్గురు జూదరులను అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరి వద్ద నుంచి ఒక కోడిని స్వాధీనం చేసుకుని రూ.960ల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. అదేవిధంగా మృత్యుంజయపాలెంలో పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని వీరి వద్ద నుంచి రూ.700 స్వాధీనం చేసుకున్నామన్నారు. కోడిపందేలు, పేకాటలు నిర్వహించినా, పందేలుకాసిన చర్యలు తప్పవన్నారు. నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు చెప్పారు.

అప్రమత్తంగా ఉన్నప్పడే ప్రమాదాల నివారణ

బాపట్లటౌన్: వాహనచోదకులు అప్రమత్తంగా ఉన్నప్పుడే రోడ్డు ప్రమాదాలను నివారించగలమని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా శనివారం నో యాక్సిడెంట్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ జిల్లాలోని పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ఉన్న యాక్సిడెంట్ ప్రోన్ ఏరియా, బ్లాక్ స్పాట్స్‌లలో పోలీస్ సిబ్బంది, అధికారులు విధులు నిర్వహిస్తూ రోడ్డు భద్రత నియమాలు, మోటారు వాహనాల చట్టల గురించి వాహన చోదకులు, ప్రజలకు అవగాహన కల్పించారన్నారు. హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం వలన కలిగే ఉపయోగాలను ప్రజలకు వివరించారు. ఓవర్ లోడ్, ట్రిపుల్ రైడింగ్‌తో వాహనాలను నడపడం వలన రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం అధికంగా ఉంటుందన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం వలన కలిగే అనర్థాలు గురించి వివరించారు. మైనర్లు వాహనం నడుపుతూ ఏదైనా రోడ్డు ప్రమాదానికి కారణమైతే వాహనాన్ని నడిపిన మైనర్ తో పాటు వాహన యజమానిని కూడా నిందితులుగా పరిగణించాల్సి వస్తుందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామన్నారు. ప్రతి ఒక్కరు తప్పనిసరిగా రోడ్డు భద్రత నియమాలను పాటించాలన్నారు.

పట్టణాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ



రేపల్లె రూరల్: పట్టణాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ అన్నారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో శనివారం సాధారణ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పుర ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ వద్ద ఇటీవల మరమ్మతులు నిర్వహించి వాటర్ బెడ్‌లు మార్పించటం జరిగిందన్నారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులతో చర్చిస్తున్నట్లు చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు వార్డులలో ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సమస్యలేమైనా తమ దృష్టికి వస్తే పరిష్కరించే దిశగా ముందుకు సాగాలని కోరారు. తమ వార్డుల్లో పారిశుధ్య సమస్య తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని చెప్పారు. పర్యావరణానికి హాని కలిగించే పాలిథిన్‌ను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని, వాటిస్థానంలో గన్నీబ్యాగులను వినియోగించే విధంగా కౌన్సిలర్‌లు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం అజెండాలోని 48 అంశాలను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. మున్సిపల్ వైస్ చైర్మన్ తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, కమిషనర్ విజయసారథి, వివిధ వార్డుల కౌన్సిలర్‌లు, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల ఎమ్మెల్యే టికెట్ రెడ్డి వర్గానికి కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కరుణాకర్‌రెడ్డి

బాపట్ల అర్బన్: బాపట్ల ఎమ్మెల్యే టికెట్ రెడ్లకు కేటాయించాలని ఓసీ రెడ్డి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జి.కరుణాకర్‌రెడ్డి అన్నారు. బాపట్ల రథం బజార్‌లోని యాత్రి నివాసంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఓసీ రెడ్డి సంక్షేమ సంఘ జాతీయ అధ్యక్షుడు జి.కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో సుమారు 36వేలకు పైగా రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు ఉన్నారన్నారు. అందులో ఎక్కువ శాతం ఓరుగంటి రెడ్లు ఉన్నారని పేర్కొన్నారు. గతంలో అనేకసార్లు బాపట్ల రెడ్లు ఎమ్మెల్యేలుగా గెలవడం జరిగిందన్నారు. రెడ్లకు అన్యాయం చేయవద్దని ప్రధాన రాజకీయ పార్టీలను కోరారు. రాబోయే ఎన్నికలలో బాపట్ల అసెంబ్లీ స్థానానికి అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు రెడ్డి సామాజిక వర్గానికి అసెంబ్లీ టికెట్ కేటాయించాలన్నారు. రాష్ట్రంలోని నాలుగు జిల్లాల్లో 20 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓరుగంటు రెడ్లు అత్యధిక శాతం ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అగ్రవర్ణ పేదలకు కల్పించి పది శాతం రిజర్వేషన్లు పొందేందుకు ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్స్ జారీ చేసే నిబంధనలు సరళీకృతం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు నేపథ్యంలో ఓరుగంటి రెడ్లకు కూడా ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో ఓసీ రెడ్డి సంఘం రాష్ట్ర యూత్ అధ్యక్షుడు జి.గోవిందరెడ్డి, బసవ పున్నారెడ్డి, కళ్ళం హరినాథ రెడ్డి, భోగి రెడ్డి రమేష్ రెడ్డి, దండి కనకా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ దిగజారుడు రాజకీయం

- తమ కార్యకర్తలనే మళ్లీ పార్టీలో చేర్చుకోవడం హాస్యాస్పదం
- వైఎస్సార్ సీపీ బాపట్ల మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రాఘవరెడ్డి

బాపట్ల అర్బన్: తెలుగుదేశం పార్టీ పరిస్థితి చూస్తుంటే జాలి వేస్తుందని, వారి పార్టీలో వారికే మళ్లీ కండువాలు కప్పి చేర్చుకోవడం పచ్చ పార్టీకే చెల్లిందని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ బాపట్ల మండల అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి విమర్శించారు. మండలంలోని దరివాద కొత్తపాలెం వైఎస్సార్ సీపీ కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరినట్లు ప్రకటించిన నేపథ్యంలో శనివారం పట్టణంలో ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోకి రాఘవరెడ్డి మాట్లాడుతూ గతంలో టీడీపీలో ఉన్న వారిని మళ్లీ పార్టీలో చేర్చుకోవడం దిగజారుడుతనానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జిగా ఉన్న వేగేశన నరేంద్ర వర్మ రాజకీయాలు చూస్తుంటే.. ఆయన మానసిక స్థితి ఎలా ఉందో అర్థమవుతుందని పేర్కొన్నారు. గతంలో తెలుగుదేశం పార్టీలో ఉన్న ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ విలువలతో కూడిన రాజకీయం చేశారని, ప్రస్తుత టీడీపీ ఇన్‌చార్జి వర్మ లోపభూయిష్టమైన రాజకీయాలకు తెర తీశారని మండిపడ్డారు. ఎన్ని డ్రామాలు ఆడినా రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే ఘన విజయమని, దీనిని ఎవరూ ఆపలేరని పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలతో అత్యుత్తమ పాలన అందిస్తున్నారని, అలాంటప్పుడు టీడీపీ వైపు ప్రజలు ఎందుకు చూస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గవిని కృష్ణమూర్తి, దరివాద, కొత్తపాలెంలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పరాజితులైన పోరాటయోధులను విస్మరించిన చరిత్ర

- చరిత్రలో నమోదుకానివన్నీ అబద్ధాలు కావు
- ప్రముఖ రచయిత్రి ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణి



మాట్లాడుతున్న చల్లపల్లి స్వరూపరాణి

తెనాలి: చరిత్ర విజేతలనే కీర్తించింది... వ్యక్తిత్వం, ఆత్మగౌరవం కోసం పోరాడి ఓడిపోయి, అన్నివిధాల నష్టపోయి, జీవితాలను కోల్పోయిన పరాజితులను విస్మరించిందని ప్రముఖ రచయిత్రి ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణి అన్నారు. వాస్తవానికి వీరే నిజమైన విజేతలని చెప్పారు. చరిత్రలో నమోదైనవన్నీ వాస్తవాలు కానట్టే, నమోదు కానివన్నీ అబద్ధాలు కావని స్పష్టంచేశారు. పట్టణానికి చెందిన సాహితీ, సాంస్కృతిక సంస్థ భిన్నస్వరాలు ఆధ్వర్యంలో ఆహ్వానం లక్ష్మి సంస్మరణలో నెలనెలా చర్చాకార్యక్రమంలో భాగంగా స్వరూపరాణి రచన 'మిణుగురులు'పై శనివారం రాత్రి స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో చర్చావేదిక నిర్వహించారు. కనపర్తి బెనహర్ సమన్వయకర్తగా వ్యవహరించారు. స్వరూపరాణి మాట్లాడుతూ, చరిత్రలో పురుషులు, ఆధిపత్య కులాల్లోని స్త్రీలకు స్థానం ఉందని చెబుతూ కులం, పితృస్వామ్యంచేత, వర్గపరమైన దోపిడీతో అనేకరకాలుగా హింసకు గురైన మహిళలకు స్థానం లేకుండా పోయిందన్నారు. 'మిణుగురులు' పుస్తకంలో అణగారిన వర్గాల్లోని ధిక్కారకేతనాలైన మహిళల గాథలను పొందుపరిచినట్టు తెలిపారు. ఇందులోని పాత్రలన్నీ సజీవమనీ, కులసమాజం విధించిన నిషేధపుటాజ్ఞలను ధిక్కరించి, విలువలు, ఆత్మగౌరవం కోసం జీవితాలను . ధారపోశారని చెప్పారు. నవీన సమాజ ఆవిష్కరణకు సరికొత్త చరిత్రను నిర్మించారని సోదాహరణంగా వివరించారు. చరిత్ర రచనల్లో దుర్మార్గమైన ప్రచారం జరుగుతోందని విమర్శించారు. అణగారిన కులాలు, స్త్రీలు, ఆదివాసీలు, మైనారిటీలు వివిధ చారిత్రక సందర్భాల్లో చేసిన పోరాటాలను నిర్లక్ష్యం చేసి, ఆమోదించినవారు, వకల్తా పుచ్చుకున్నవారి చరిత్రలనే పాఠ్యాంశాల్లో పొందుపరుస్తున్నట్టు ఆరోపించారు. అణగారిన వర్గాల పోరాటాలు, యుద్ధాలు, చరిత్రను ఆయా వర్గాలకు తెలియజేయాలని పూలే, అంబేద్కర్ చేసిన ప్రయత్నాన్ని స్వరూపరాణి వివరించారు. ప్రముఖ స్త్రీవాద రచయిత్రి మందరపు హైమవతి మాట్లాడుతూ, మిణుగురులు పుస్తకంలోని స్త్రీ పాత్రల చరిత్ర ఉత్తేజాన్నిస్తాయని చెప్పారు. రచయిత పిల్లి వాసు తన ప్రసంగంలో, చరిత్ర విస్మరించిన పోరాటయోధుల చరిత్రలను సమాజానికి అందించకపోతే భావితరాలకు అన్యాయం చేసినట్టు కాగలదన్నారు. న్యాయవాది జీఎస్ నాగేశ్వర రావు మాట్లాడుతూ ప్రత్యామ్నాయ భావజాలంతో చరిత్రను రాసే రచనలు రావాలని అభిప్రాయపడ్డారు. భిన్నస్వరాలు బాధ్యులు జుగాష్‌విలి, రాఘవరెడ్డి, ఉమ పర్యవేక్షించారు.

అల్లర్లకు పాల్పడితే కేసులు నమోదు

కొల్లిపర: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని డిసెంబర్31 తేదీ రాత్రి ఎవరైనా మద్యం సేవించి అల్లర్లకు పాల్పడితే అటువంటి వారిపై చట్టపరమైన కేసులు నమోదుచేస్తామని ఎస్ఐ ఆర్.రవీంద్రరెడ్డి హెచ్చరించారు. ఆయన స్థానిక స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకలను యువకులు ప్రశాంతంగా జరుపుకోవాలని పేర్కొన్నారు.